క్లుప్తంగా

కడప నగరపాలక కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్‌: కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా నిమ్మనపల్లి మనోజ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. మనోజ్‌రెడ్డిని ఇదివరకే కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినప్పటికీ డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన ఆయన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేయనున్నారు. కాబట్టి పురపాలక శాఖ ఇంకోసారి ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చింది. త్వరలోనే మనోజ్‌రెడ్డి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, ఫోటో, వీడియోగ్రఫీలో 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సుల అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల వారికి వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'ప్రైవేటు ట్రావెల్స్' దోపిడీని అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు చేస్తున్న దోపిడీపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా పండుగ సీజన్ లో ప్రజల అవసరాలను అవకాశంగా తీసుకొని జిల్లా లో ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. పండుగ పూట రావాలన్నా.. తిరిగి వెళ్లాలన్నా ప్రజలు భయపడే రీతిలో ట్రావెల్స్ యజమానులు చార్జీలు వసూలు చేస్తున్నాయన్నారు. విజయవాడ, హైదారాబాద్ వంటి ప్రాంతాలకు రూ. 3 వేలు నుండి రూ.5 వేలు వరకు చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. రవాణా శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్థికసాయం



మృతుని కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న విజయ్‌భట్టర్

కడప కల్చరల్ : దసరా పండుగ తుదిరోజు నగరంలో జరిగిన ఓ ఆలయ ఊరేగింపులో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కార్మికుడు నరసింహులు కుటుంబానికి జిల్లా అర్చక పురోహిత సమాఖ్య అండగా నిలిచింది. శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయ అర్చకులు, సంస్థ జిల్లా అధ్యక్షులు విజయ్‌భట్టర్ తన సహచరులతో కలిసి మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు రూ. 10 వేల నగదుతోపాటు నిత్యావసర సరుకులుకూడా అందజేశారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



సూచనలు ఇస్తున్న ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్

కడప అగ్రికల్చర్: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా పంటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఊటుకూరు ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్ తెలిపారు. కడప మండల పరిధిలోని పాలెంపల్లెలో మంగళవారం వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అంకయ్యకుమార్ పాలెంపల్లిలోని వరిపంటను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ వరిపంటలో అక్కడక్కడ కొనలు ఎర్రబడటం కనిపిస్తుందన్నారు. దీని నివారణకు ప్లాంటో మైసిన్‌ను 200 గ్రాములు నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పంట నమోదు జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించామని తెలిపారు. ఏఈఓలు పావని, మెహరాజ్ పాల్గొన్నారు.

బద్వేలు ఇన్‌ఛార్జి డీఎంగా గోవర్ధన్ రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ బద్వేలు ఇన్‌ఛార్జి డీఎంగా గోవర్ధన్‌రెడ్డిని నియమిస్తూ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (విజయవాడ) బ్రహ్మానందరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కడప జోన్ కార్గోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న గోవర్ధన్‌రెడ్డిని బద్వేలు ఇన్‌ఛార్జి డీఎంగా నియమించారు. సాధారణ బదిలీల్లో భాగంగా బద్వేలులో పనిచేస్తున్న డీఎంను అనంతపురానికి బదిలీ చేశారు. బద్వేలులో ఖాళీగా ఉన్న స్థానంలో గోవర్ధన్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎప్పుడు వానొచ్చినా ఇంతే..?

- ఎన్నాళ్లో మురుగు నీటి సమస్య
- చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండ్
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- ఉన్నతాధికారులు పట్టించుకోవాలని వేడుకోలు



కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో చెరువును తలపిస్తున్న వర్షం నీరు

కడప ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రమైన కడపలో చిన్నపాటి వర్షం కురిసినా ఆర్టీసీ బస్టాండ్ వర్షపు నీటితో నిండి చెరువును తలపిస్తోంది. ఎప్పుడు వానొచ్చినా ఇంతే.. ఇలాగే నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. దీంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడంతో దుర్గంధం రావడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. బస్సు దిగాలన్నా.. ఎక్కాలన్నా.. ఈ మురుగునీటిపై వెళ్లాల్సిందే. దీంతో ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు కాలు జారి కిందపడిన సందర్భాలు ఉన్నాయి. బ్యాగులు, ఇతర లగేజీ తీసుకువెళ్లాలన్నా అవస్థలు పడాల్సి వస్తోంది. అప్పుడప్పుడు మున్సిపాలిటీ వారు వచ్చి బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తారు. అయినా పూర్తిస్థాయిలో తొలిగిపోకుండా నీరు నిలిచే ఉంటాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్విత పరిష్కారం చూపాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్ వరకు నిండుగా ఉన్న వాన నీరు



మున్సిపాలిటీ సిబ్బంది మిషన్‌తో తొలగించినా పూర్తిగా పోని నీరు

నెలల తరబడి తీరని సమస్య...



బస్టాండ్‌లో వర్షపు నీరు నిలబడటం అనేది ఇప్పటి సమస్య కాదు. నెలల తరబడి పేరుకున్న సమస్య. చిన్నపాటి వర్షం వచ్చినా వర్షపు నీరు పోయే ఆస్కారం లేక ఆ నీరంతా బస్టాండ్‌లోనే నిలబడుతుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– కోలా రామచంద్రయ్య, ఎన్‌జీవో కాలనీ, కడప

దుర్వాసన వస్తోంది...



వర్షపునీరు బయటకు పోయేందుకు వీలు లేకపోవడంతో ఎక్కువకాలం బస్టాండ్‌లో నీరంతా నిల్వ ఉంటోంది. దీంతోపాటు ఆ నీటిలో నిత్యం బస్సులు తిరగడంతో ఆ నీరంతా మురుగునీటిగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయంలో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– జి. గురమయ్య, కడప

వాన వచ్చిన ప్రతిసారీ ఇబ్బందులే...



బస్టాండ్‌లో రోజుల తరబడి వర్షపు నీరు నిలబడటంతో ప్రయాణికులు బస్సులు ఎక్కి దిగాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చాలా కాలం నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. రాత్రి పూట బస్టాండ్‌లో వేచి ఉండే ప్రయాణికులు దోమలతో ఇక్కట్లు పడుతున్నారు.

– నరసింహులు, శంకరాపురం, కడప

తాగండి...తాగి ఊగండి అన్నదే ప్రభుత్వ సిద్ధాంతం

వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి



మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్‌: తాగండి...తాగి ఊగండి అన్నదే ప్రభుత్వ సిద్ధాంతంగా ఉందని వైఎస్సార్ సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పదిహేను రోజులుగా మద్యం పాలసీ, దాని అమలు తీరుపై కూటమి ప్రభుత్వం చేస్తున్నదానిపై ఆనందపడాలో, బాధపడాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఏ ప్రభుత్వానికైనా మద్యం ఆదాయవనరు మాత్రమేనని, కూటమి ప్రభుత్వం దానిని ప్రవేశపెట్టిన తీరు సరిగా లేదన్నారు. ప్రజల జీవనాడిని దెబ్బ తీసేలా, లిక్కర్ సిండికేట్‌ను ప్రోత్సహించేలా మద్యం పాలసీ ఉందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక దాన్ని పూర్తిగా మర్చిపోయిందన్నారు. తెలంగాణలో 2వేల పైచిలుకు షాపులకు లక్షా యాభైవేల దరఖాస్తులు వస్తే, మన రాష్ట్రంలో మూడు వేల మూడు వందల షాపులకు కేవలం 80వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు. మద్యం షాపుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం తేవాలన్న ముఖ్యమంత్రి విజన్‌కు ఆ పార్టీ నాయకులే తూట్లు పొడిచారన్నారు. అడ్వర్‌టైజ్‌మెంట్ చేయడంలో సీఎం చంద్రబాబును మించిన వారు లేరని, రూ.99లకే నాణ్యమైన మద్యం అని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం...ప్రజలు దానిని తాగి అనారోగ్యబారిన పడితే వారి లివర్లు, కిడ్నీలకు ఏదైనా ప్యాకేజీ ప్రకటిస్తుందా అని ఎద్దేవా చేశారు. ఈ మద్యం తాగి అనారోగ్య బారిన పడిన వారికి ప్రభుత్వం పూచీకత్తు ఏమైనా ఇస్తుందా .. అని ప్రశ్నించారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, వైద్యం, పౌష్టికాహారం వంటి ధరలు ఆకాశాన్నంటుతుంటే, ఒక్క మద్యం మాత్రమే సరసమైన ధరలకు ఇస్తే సరిపోతుందా అని నిలదీశారు. విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడానికే పులివెందుల మెడికల్ కళాశాలకు మెడికల్ సీట్లు వద్దని లేఖ రాశారని, ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోవాల న్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జీఎస్ భాస్కర్ రెడ్డి, చీర్ల సురేష్ యాదవ్, జి. శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎస్ఐ శాంత

కడప ఎడ్యుకేషన్‌: మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మహిళ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శాంతి సూచించారు. మంగళవారం కడపలోని నగరపాలక ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జబితాఖానం ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు మానవ అక్రమ రవాణాపై బాలికా విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎంఈఓ గంగిరెడ్డి మాట్లాడుతూ బాలికలు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ఏదైనా ఇబ్బందికర సమస్యలుంటే వెంటనే పాఠశాల ఉపాధ్యాయులకు , తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సహదేవరెడ్డి, నగరపాలక పాఠశాలల సూపర్‌వైజర్ ఫరూక్ అహ్మద్ పాల్గొన్నారు.

రూ. 10 నాణేలపై అవగాహన సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతీయ రిజర్వు బ్యాంకు సూచనల మేరకు రూ. 10 నాణేల చెల్లుబాటుపై మంగళవారం కడప నగరం కాగితాలపెంటలోని ఏపీజీబీ శాఖలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు ఆర్ఎం శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ రూ. 10 నాణేలు పూర్తిగా చట్టబద్ధమైనవని, అన్నిచోట్లా చెల్లుబాటు అవుతాయన్నారు. ప్రజలు, దుకాణదారులు వీటిని నిరభ్యంతరంగా స్వీకరించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ మేనేజర్లు చిరంజీవి, ప్రశాంత్, గోపిరెడ్డి, నవీన్, సందానిబాషతోపాటు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శం



వైవీయూ: మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా



కడప ఎడ్యుకేషన్‌: కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

వైవీయూ: మిస్సైల్‌మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందిన భారతరత్నం ఏపీజే అబ్దుల్‌కలాం జీవితం మనందరికీ ఆదర్శమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విజన్ ఉన్న గొప్ప నాయకుడి జయంతిని ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. జి. విజయలక్ష్మిదేవి, డా. గురు మోహన్‌రెడ్డి, డా. రాజమోహన్‌రెడ్డి, డా. సుబ్రమణ్యం, వీరభద్రయ్య, రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్‌: ఏపీజే అబ్దుల్‌కలాంను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు అన్నారు. మంగళవారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆర్కే రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉర్దూ అధ్యాపకులు డాక్టర్ అంజద్‌బాషా, రాయల్ కరీం సేవా సమితి అధినేత రాయల్ కరీముల్లా, అధ్యాపకులు భాగ్యలక్షుమ్మ, భరత్, చంద్ర మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వాతావరణ సమతుల్యతకు మొక్కలు కీలకం



మొక్కనాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎల్ఐసీ అధికారి సరస్వతి గోపకుమార్ తదితరులు

కడప కల్చరల్ : వాతావరణ సమతుల్యతకు మరిన్ని మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని జీవిత బీమా సంస్థ జోనల్ అధికారి సరస్వతి గోపకుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయ ఆవరణలో 'ప్లాంట్ ఎ లైఫ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ మొక్కల పట్ల, వాతావరణం పట్ల అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. దీన్ని తమ లక్ష్యాలలో ఒకటిగా ఎల్ఐసీ స్వీకరించిందని అన్నారు. వాతావరణ సమతుల్యత దెబ్బ తినడం వల్ల అకాల వర్షాలు, ఆకస్మిక వరదలు, ఉష్ణోగ్రతల్లో తేడాలు సంభవిస్తున్నాయని, ఇవి ఉత్పాదక రంగాలను దెబ్బతీస్తున్నాయని అన్నారు. నాగరికతకు చిహ్నమైన మొక్కలు పెంచడం, కాలుష్యాన్ని నివారించడం, గ్రీన్ ట్రిబ్యునల్ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేయడం ద్వారానే మనం ప్రతికూల వాతావరణ మార్పులను అడ్డుకోవడం సాధ్యమన్నారు. ఈ స్పృహ మొత్తం సమాజం , ప్రజలలో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్, మార్కెటింగ్ మేనేజర్ శ్యామసుందర్రావు, ఇతర మేనేజర్లు సత్య శ్రీనివాస్, సత్యప్రసాద్ సంఘాల నేతలు చంద్రపాల్, రఘునాథరెడ్డి, రామాంజనేయులు, రెడ్డి భాస్కర్, అధికారులు రమేష్ బాబు, హరీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశాన్ని కాలుష్య రహిత దేశంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రతి ఒక్కరూ నడుంబిగించి మనకు జన్మనిచ్చిన అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని కడప నగరం గాంధీనగర్ హైస్కూల్ హెచ్ఎం పుష్పకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం నెహ్రూ యువ కేంద్రం సహకారంతో జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత అతిథులు ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

దోష నివారణ పూజలు

కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

– కడప కల్చరల్



నగరంలో జోరు వాన



కడప నగరంలో మంగళవారం రాత్రి జోరు వాన కురిసింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారులపై వాన నీరు మోకాటి లోతులో ప్రవహించింది. గురుకుల్ విద్యాపీఠ్ వద్ద మరి కొన్ని ప్రాంతాలలో కాలువలు నిండి ఆ నీరంతా రోడ్డుపై పారింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. – కడప కోటిరెడ్డి సర్కిల్

హాస్టళ్లను తనిఖీ చేసిన జడ్జి



వంట గదిలోని సరుకులను పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్‌: జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తమ సిబ్బందితో కలిసి కడప నగరంలోని ట్రైబల్ హాస్టళ్లను తనిఖీ చేశారు. మరియాపురం, ఐటీఐ సర్కిల్, చిన్నచౌక్, బుడ్డాయపల్లెలో గల బాలుర, బాలికల ట్రైబల్ హాస్టల్స్‌ను తనిఖీ చేశారు. వంటశాలను, వసతిగదులను, డైనింగ్‌హాల్‌ను, స్టోర్ రూమ్‌ను, పరిసరాలను పరిశీలించారు. తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్: 15100 మొదలైన అంశాలను వివరించారు.

సీఈకి శుభాకాంక్షలు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల నూతన పరీక్షల నియంత్రణాధికారిగా నియమితులైన డాక్టర్ పెనుగొండ రామకృష్ణను ప్రభుత్వ కళాశాలల అధ్యాపక సంఘం (జీసీటీఏ) నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీసీటీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆర్. నీలయ్య మాట్లాడుతూ త్వరలో కళాశాలకు న్యాక్ పీర్ కమిటీ రానున్న నేపథ్యంలో సీఈ విధులను ప్రతిష్టాత్మకంగా భావించి ఉత్తమ గ్రేడింగ్ లభించేలా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డా. సురేష్ బాబు, డా.నాగేశ్వర్‌రెడ్డి, డా. మహేష్, డా. వీరనాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

కడప అర్బన్‌: కడప నగరం నబీకోటకు చెందిన తన్మయి వెల్‌నెస్ వరల్డ్ యజమాని మడితాటి వీరబ్రహ్మయ్య ఆచారి, ఆయన తల్లిదండ్రులైన రాజమ్మ, కృష్ణమాచారి మంగళవారం ప్రేమాలయ నిరాశ్రయుల నివాస వసతిగృహంలో అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డిలక్ష్మణ్, పుట్టా పురుషోత్తం, వెంకటసురేష్‌బాబు, టైలర్ రవి, ఎలక్ట్రీషియన్ మధు, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

పెద్ద కాలువల్లో గడ్డిని పూర్తిగా తొలగించాలి



కాలువను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర

కడప కార్పొరేషన్‌: కడప నగరంలోని పెద్ద కాలువల్లో గడ్డిని పూర్తిగా తొలగించాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన చిన్నచౌకు, కో ఆపరేటివ్‌కాలనీ, రాజారెడ్డి వీధి, గురుకుల్ విద్యాపీఠ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. శుభ్రతా ప్రమాణాలు ఎంత ముఖ్యమో అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ధనలక్ష్మి, డీఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఐఆర్ వెంటనే ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్‌: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఐఆర్ ప్రకటించకపోవడం బాధాకరం అని, వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు రమణా రెడ్డి, వెంకటనాథ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమరనాథ రెడ్డి, రమేష్‌బాబులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణం 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ దీపావళి కానుకగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒక డీఏను ప్రకటించాలన్నారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలను ప్రతి నెలా చెల్లించాలని డిమాండ్ చేశారు.